# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము మూడు దేశాల విదేశీ పర్యటనలో భాగంగా ఈ రోజు మలావీ చేరుకున్నారు.
- ❖ భాష, సాహిత్యం, కళ, ఆధ్యాత్మికత వంటి సాంస్కృతిక మూలస్థంభాలు దేశానికి గుర్తింపు తీసుకువస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు.
- ❖ భారత దౌత్యవేత్తలపై చేసిన ఆరోపణలకు కెనడా ఎటువంటి ఆధారాలు అందించలేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.
- ❖ న్యూఢిల్లీలో జరుగుతున్న ఐ.ఎఫ్.ఎఫ్.ఎస్. వరల్డ్ కప్ ఫైనల్లో వివాన్ కపూర్ రజత పతకం సాధించారు.

==============================

భారత్ - మలావి దేశాల మధ్య స్నేహపూర్వక, ఆర్థిక సంబంధాలు దృఢంగా ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా ఈరోజు మలావి చేరుకున్న రాష్ట్రపతి మలావిలోని లిలాంగ్వేలో జరిగిన ఇండియా - మలావీ వాణిజ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. 1964లో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మలావితో దౌత్య సంబంధాలను ఏర్పరచుకున్న మొదటి దేశాల్లో భారత్ ఒకటని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భారతదేశం ప్రస్తుతం మలావికి నాల్గవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉందని, మలావి అతిపెద్ద పెట్టుబడిదారులలో భారత్ కూడా ఒకటి అని అన్నారు. భారత్ - మలావి దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మెరుగుపరిచేందుకు పరస్పర సహకారంతో రెండు దేశాలు కలసి పని చేయాలని ఇరు దేశాలలోని వ్యాపార వర్గాలకు రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

(వాయిస్ 39 సెకన్లు)

==============================

హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. పంచకులలోని షాలిమార్ మైదానంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయన చేత ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు 13 మంది శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, మనోహర్ లాల్ ఖట్టర్, లల్లన్ సింగ్, అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుబాబు నాయుడు, ఇతర ముఖ్య నాయకులు ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు.

==============================

భాష, సాహిత్యం, కళ, ఆధ్యాత్మికత వంటి సాంస్కృతిక మూలస్థంభాలు దేశానికి గుర్తింపును తీసుకువస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ అభిదామ దివాస్ లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బుద్ధ భగవానుడి భోధనలు దేశ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచానికి నాయకత్వం వహిస్తూనే.. దేశ యువత తమ సంస్కృతి, విలువలను చూసి గర్వపడాలని పిలుపునిచ్చారు. పాళీ భాషకు ప్రాచీన హోదా కల్పించిన ప్రభుత్వ నిర్ణయం, బుద్ధ భగవానుడి గొప్ప వారసత్వాన్ని గౌరవించడమేనన్నారు. భాషలు కేవలం సంభాషణ మాధ్యమం కాదని, నాగరికత, సంస్కృతికి ఆత్మ వంటివని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

రైల్వే టికెట్ రిజర్వేషన్లకు సంబంధించి భారతీయ రైల్వే కొత్త మార్గదర్శకలను ఈరోజు విడుదల చేసింది. ప్రస్తుతం రైల్వే ప్రయాణానికి 120 రోజుల ముందుగానే టికెట్ బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండగా.. దానిని 60 రోజులకు కుదిస్తూ... నిర్ణయం తీసుకుంది. దీనికోసం ఐఆర్‌సీటీసీ నిబంధనల్లో మార్పులు చేసింది. నవంబర్ 1 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుందని అయితే ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి మాత్రం ఎటువంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

==============================

న్యూఢిల్లీలో జరుగుతున్న ISSF వరల్డ్ కప్ ఫైనల్లో వివాన్ కపూర్ రజత పతకం సాధించారు. ఫైనల్లో చైనా క్రీడాకారుడు యింగ్ క్వీ కంటే వివాన్ 44 పాయింట్లు వెనుకబడడంతో స్వర్ణ పతకాన్ని కోల్పోయాడు. దీంతో ఈ వరల్డ్ కప్ లో భారత పతకాల సంఖ్య నాలుగుకు చేరింది.

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో పి.వి. సింధు ఈరోజు జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో చైనాకు క్రీడాకారిణి హాన్ యూపై విజయం సాధించింది.

బెంగుళూరు వేదికగా జరుగుతున్న భారత్ - న్యూజీలాండ్ జట్ల మధ్య తొలి టెస్టు మ్యాచ్ రెండవ రోజు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 46 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ ఈరోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టపోయి 180 పరుగులు చేయడంతో 134 పరుగుల ఆధిక్యంలో ఉంది.

విరామం

==============================

కెనడా ప్రభుత్వం నిరాధారమైన ఆరోపణల కారణంగా ప్రస్తుత వివాదం నెలకొందని భారత్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన

మాట్లాడుతూ... భారత దౌత్యవేత్తలపై చేసిన ఆరోపణలకు మద్దతుగా కెనడా ఇంకా ఎటువంటి ఆధారాలు అందించలేదని తెలిపారు. రాజకీయ ప్రేరేపిత ప్రయత్నంలో భాగంగా భారతదేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కెనడా ప్రభుత్వం నిరాదార ఆరోపణలు చేసిందన్నారు. భారత్ - కెనడా దేశాల మధ్య బలమైన ఆర్థిక సంబంధాలు ఉన్నాయని, కెనడాలో అతిపెద్ద సంఖ్యలో భారత సమాజం నివశిస్తోందని పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

బీహార్ రాష్ట్రంలోని సరన్, సివాన్ జిల్లాల్లో కల్తీ మద్యం సేవించి 24 మంది ప్రాణాలు కోల్పోయారని ఎస్పీ అమితేష్ కుమార్ తెలిపారు. మరో 15 మంది అస్వస్థతకు గురి కావడంతో వారిని పాట్నాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు సిట్‌ను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈమేరకు 8 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. అందులో ముగ్గుర్ని ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఆయన వెల్లడించారు.

==============================

ప్రజలకు విశ్వసనీయమైన సమాచారం అందించడంలో ప్రసార మాధ్యమాలది అతి పెద్ద బాధ్యత అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ అన్నారు. ఈరోజు న్యూ ఢిల్లీలోని ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఏర్పాటు చేసిన "ప్రసార రంగంలో వర్ధమాన సాంకేతికతలు" అనే అంశంపై జరిగిన సింపోజియంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రసారాల్లో విశేష మార్పుల కోసం భవిష్యత్తుకు అనుగుణమైన కొత్త సాంకేతికతను వినియోగించుకోవడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

(వాయిస్ 10 సెకన్లు)

==============================

భారతదేశంలోని రక్షిత ప్రాంతాలలో నామ్‌దఫా నేషనల్ పార్క్ తర్వాత కజిరంగా జాతీయ పార్క్ సీతాకోకచిలుకల జాతుల వైవిధ్యంలో రెండవ స్థానంలో నిలిచిందని శాస్త్రవేత్త మాన్‌సూన్ జ్యోతి గొగోయ్ తెలిపారు. కజిరంగా నేషనల్ పార్క్‌లో 446 కంటే ఎక్కువ సీతాకోకచిలుక జాతులను గుర్తించామని ఆయన వెల్లడించారు. సీతాకోకచిలుకలపై గొగోయ్ చేస్తున్న అధ్యయనాలకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

==============================

హెజ్‌బొల్లాలోని సొరంగ స్థావరాలపై ఇజ్రాయెల్ దళాలు జరిపిన సోదాల్లో రష్యాకు చెందిన ఆయుధాలు లభించాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, దక్షిణ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై తమ దళాలు జరిపిన సోదాల్లో రష్యాకు చెందిన అత్యాధునిక ఆయుధాలు కనుగొన్నామని అన్నారు. లెబనాన్‌లో కొత్త అంతర్యుద్ధం ఒక విషాదంగా మారుతుందని, ఆ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదని కానీ, లెబనాన్ సరిహద్దుల్లో నివసిస్తున్న ఇజ్రాయెల్ పౌరులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరడమే తమ లక్ష్య మని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు.

==============================
==============================